
# బరియల్ పార్క్

డా॥ వి.ఆర్. రాసాని

ఏమయ్యా! వున్నట్టుండి యిట్టా పని జేస్తివి. నీ పాసులగోల వొగసూరి సూడయ్యా యిట్లా! నేనయ్యా! నీ భారీని సిద్దలచ్చిమినొచ్చిండా వొగసూరి అట్ల కండ్లు తెర్సి సూడయ్యా మారాజా! మనూర్లో సమచ్చదానికొగతూరి ఎండాకాలంలో... కంగుంది కుప్పంవోళ్లు వచ్చి భారతాలాడతా వుండ్రి గదా. ఆ నాటకాల్లో నువ్వూ భీముని యేసికం కడతావుంటివి. భీముడంటే ఏం సామాన్యుడా! భయమూ భీతు ఎరగనోడు. పిరికితనం లేనోడు, పగోనికి భయపడనోడు. మరి... ఆ యేసికం గట్టే నీకు ఆయప్ప ధైర్నంలో సాసవ గింజంతయినా రావద్దా.. ప్రతి సీరామనవమికి మన పిడసల గంగమ్మ గుడి ముందర సుక్కులూరి రామ నాటకం యేస్తా వుండ్రి. అందులోనూ ఆంజనేయ సామి యేసికం యేస్తా వుంటివి.



ఆ సామి ఏమి తక్కువైనోడా! ఎంత కష్టమొచ్చినా ఎదురు లేకండా జయించుకొచ్చేసేవోడు. మరి... ఆ యేసం యేసే నీకు ఆ సామికుండే గుండె నిబ్బరంలో కనీసం వొగ మిరాల గింజంతన్నా రావద్దా? అదేదీ లేకండా అరగాసు సర్కారోని కోసరం యిట్టాపని జేసుకుంటివా?

పొద్దన నీ సావాసి కాపు నర్సిమ్ములొచ్చి సూసి పాయ పోతా పోతా "ధరమరాజుమంటోడు సీమక్కూడా అపకారం జేసేవోడు గాదు. ఏసురు బాములాంటోడు. అట్టాంటోడు యిట్టా పని యెట్ల జేశ?" అనేసి పాయ.

నిన్న లింగాపురం నుంచీ మీ సెల్లి రామాంజులు వచ్చి "అయ్యో అన్నా! నీకెంత కష్టమొచ్చెరా తండ్రీ. సిన్నప్పుడే అమ్మా నాయనా కాలమై పోతే, నువ్వే తల్లీ దండ్రీ అయ్యి నన్ను సాకి సంతరిస్తివి. పెండ్లి జేసి నన్నొగ యింటి దాన్ని జేస్తివి. అట్టా మారాజువి. యిప్పుడు నీకెంత కష్టమొచ్చెరా దేముడా" అంటా రెండు సేతుల్తో రొమ్ములు బాదుకుంటా, నెత్తీ నోరు కొట్టుకోని ఏడ్సి పాయ. అదీ పోతా పోతా "మాయన్న యిట్లా ఎందుకు జేసుకుండే?" అని అడిగి పాయ వచ్చినోళ్ళందురూ అదే మాదిరి అని పోబట్రి. వోళ్ళకంతా నేనెట్లా జవాబు సెప్పేది?

అయ్యో మహన్నబావా! యిప్పుడు నేనూ అడగతావుండా! సెప్పు. నువ్వెందుకు యిట్టా పని జేసుకుంటివి?

ఎప్పుడూ వొగన్ని దేహీ అంటా ఆశించింది లే. వొగని సొమ్ముకు పోయిందీ లే. వొగని ఆలికి బోలా! వొగని జోలికి బోలా!

ఎన్నో తూరలు వానలు బడక కరువుకు పంటలు బండక పైర్లు ఎండిపోయి, సేసిన అప్పులు తీర్సలేక అల్లాడి పోయినప్పుడు గూడా నువ్విట్లా పని జెయ్యలా... ఏ అన్నేకారి కష్టమొచ్చిందని యిట్లా పని జేసుకుంటివి?

నా భూమి నా భూమి అంటా, సేద్దెమే ఊపిరిగా బతికినోడివి. అది నీకేం జేశ? అయ్యో ఎర్రి మారాజా! ఈ భూమీ, ఈ ఇండ్లూ వాకిండ్లూ అన్నీ ఈ రోజు నీవి. రేపింకెవ్వురివో గదా! వాటి కోసరం యిట్ల జేసుకుంటివా..

బతికినంత కాలం నా బిడ్డలు నా బిడ్డలు అంటా జీవిస్తివి. మరి ఆ బిడ్డలు నీకేం జేసిరి? ఈ బిడ్డలూ పాపలూ అంతా వట్టిదయ్యా!

అందరూ వచ్చిరి పోయిరి. నిన్నిట్లా జూసి నిజం ఏడుపులో, బెల్లేడుపులో ఏవో వొగిటి యేడ్సి పోయిరి. కానీ నీ నెత్తురు పంచుకోని పుట్టిన బిడ్డలు, నీ నీరుకు పుట్టిన బిడ్డలు... వోళ్ళు మాత్రం రాలా. నిన్ను కాదనుకోని పోయిన ఆ నా కొడుకులు, నా కడుపున పుట్టినంత మాత్రాన... నా బిడ్డలెట్లా అవుతారు. కష్టంలో నష్టంలో తోడున్నోళ్ళే బిడ్లు. అంతే గానీ ఈ ముసిలోళ్లు ఎప్పుడు సచ్చి పోతారా, వాళ్ళ తావన వుండే ఆ కాసింతా ఎప్పుడు పెరుక్కుంటామా అంటా గుంతకాడ నక్కల మాదిరి కాసుకోనుండే వోళ్లూ వొగ బిడ్డలేనా? కాదు. వోళ్ళు దాయాదులు పగోళ్లు నీ ఆస్తి పాస్తి పంచుకుండ్రే గానీ, యీ ముసిలిమొప్పెన మన



కష్టాలేమన్నా పంచుకుండ్రా? వోళ్ల నెట్లా సాకితివి? నువ్వసలు ఎట్లా జూసుకుంటివి. అంత అపురూపంగా జూసుకుంటివి. కండ్లల్లో వొగన్ని, గుండెల్లో వొగన్ని పెట్టుకోని సూసుకుంటివి. ముక్కెసంగా నీ పెద్ద కొడుకును యెట్ట జూస్తివి..

మన పెండ్లయిన సమచ్చరానికి వోడు బుట్టె అచ్చంగా నీ పోలికే. వోన్ని జూసుకోని యెంత ముర్సిపోతివి. ఎంత మురిపెం జూపిస్తివి... వోడంటే నీకెంత ముదిగారమో!

పొద్దస్తమానం ఎల్లికలా పడుకోని మోకాళ్ల మింద బోర్లేసుకోని 'దూరి దూరి తందనానా... నీపేరేమి... దూరి దూరి తందనానా... నీ యమ్మ పేరేమి' అంటా ఆడిస్తా మన పేర్లు చెప్పించుకోని పొంగి పోతావుంటివి. నిద్దరోస్తే అట్లే కడుప్పయిన పెట్టుకోని నిద్దర పుచ్చతా వుంటివి వోడికి నీ కాళ్లే ఉయ్యాల. నీ కడుపే పరుపు. వొడికి ఏడో నెలలో... పండ్లొచ్చేటప్పుడు సందిగొట్టి, చేదులు పట్టుకుండె. మాటి మాటికి ముసర వాంతి జేసుకుంటా వుండే. తాగిన పాలు తాగినట్టే కక్కతా వుండె. బిడ్డ నీరసించి పాయ. ఎళ్ల బలినమై పాయ. పిల్లోడు బల్లి మదిరి కరసక పాయ. బుచ్చిమొగం పడి పాయ. వోణ్ణి జూసి నీ మొణుసు అల్లాడి పోతా వుండె. ఎందరో వైదుగులకి జూపిస్తివి. బాల గ్రహాలేమోనని మంతరించి, తాయెత్తు కట్టిస్తివి. తాటాకు మింద సీటీ రాయించి మెడలో కట్టిస్తివి. ధైర్నం జెప్పి నువ్వూ యేడస్తా వుంటివి. కడాకు మనసేన్లో జరిగే పిడసల గంగమ్మ జాతరలో పిల్లోన్ని భుజానేసుకోని అందరికంటే ముందే అగ్గిని గుండం తొక్కేసొస్తివి.. అప్పుడు నీ కాళ్లు కాలిపోయి బొబ్బలెక్కె నెల పడకోస్తే గానీ అవి మానలే. అట్టా సాకితివి. మరి... ఈ కష్ట కాలంలో వోడు ఇట్ట మొగమన్నా సూపించినాడా? లేదే.

వొడుసరే. యింకొగడుండాడు సూడు తల గెరివి నా కొడుకు. సిన్నోడు. వోణ్ణి మాత్రం తక్కువగా జూస్తివా? పైన పెడితే డేగ ఎత్తక పోతాడేమొ. కింద బెడితే సీమలు కుడతాయేమొ అన్నిట్టు సాకితివి.

వోడేమి సామాన్యుడా... తుళవ నా కొడుకు. కొంతేగాలం ముండాకొడుకు. వొగతూరి కొటంలో అటక మిందికెక్కి, పిడకల తట్టలో పందికుక్కు కనిపిచ్చిందని, అక్కడి నుంచీ కిందికి దూకేసినాడు. ఆ దెబ్బకు కాలిరిగె. నీ మొణుసు నీరై పాయ. వోణ్ణి భుజానేసుకోని, ఈసలాపురం బోతివి. కట్టుకట్టిస్తివి. ఎట్లో వొగట్ల బాగ జేసుకుంటివి. యింకొగసూరి... వున్నిట్టుండి తెలివి లేకుండా పడిపాయ. ఊర్లో వోళ్లు వాయి రోగం, మూర్చ, యేమాత్రం ఏమారద్దండి అండ్రి. అంతే వోణ్ణి తీసకపోయి కరికిరిలో శ్రీనివాసులు డాక్టరు దెగ్గర మందు పోయించుకోనొస్తివి. ''వోడు మూర్చరోగమోడై పోతే, వోడికి పెండ్లి ఎట్లయితాది. ఆపైన వోణ్ణి ఎవురు జూసుకుంటారు?'' అంటా వొగిటే యాతన పడితివి. ఆరు నెలలు పాటు కలికిరికి తిరిగి తిరిగి ఎట్లో వొగట్ల.. కన్న కష్టాలు బడి బాగ జేయిస్తివి. అన్ని దినాలూ నీ కంటికి నిద్దర్లా. కడుపుకంత తిండిలా ఆ మాదిరిగా ఏమొచ్చినా బాగు జేయించుకోని అప్పో సాప్పో జేసి బాగా సదివించి ఉద్యోగాల్లో చేరేటట్ల జేస్తివి. మంచి సంబంధాలు జూసి పెండ్లిండ్లు గూడా జేసేస్తివి. మన గండ్రాజు పల్లెకే గాకుండా ఈ గంగవరం మండలానికే వోళ్లను మొనగోళ్లనిపిస్తివి. వోళ్లిప్పుడు పిల్లా పాపల్తో సల్లంగుండారు గానీ, ఆ మనవళ్లను, మనవరాండ్రను జూసుకోని మురిసిపోయే బాగ్గెం మాత్రం లేకండా జేసిరి. అదీ వోళ్లు నీకు జేసిన మేలు. వోళ్లకంటే పగోళ్లు మేలు పో.

ఈ గండ్రాజు పల్లె మెల్లి మెల్లిగా ఉద్ధిలోకొచ్చె. మడుషులకు నాగరీకం ముదిరి పోవచ్చె కాని దిన దినానికి వానలు బడేది తగ్గిపాయ. ఏ రెండు మూడేండ్లకో వొగతూరి అట్ల పంటలు పండతా వుండె.. సమచ్చరం సమచ్చరానికి వరుపు పెరిగి, భూములు బీళ్లు పడి పాయ. రాజనాలు పండిన సేన్లల్లో తొండెకిలు గుడ్లు పెట్టె. భూములకు యిలువ తగ్గి పాయ. అమ్ముదామంటే అడివి, కొందామంటే కొరివి అన్నట్టుండె.

అయితే ఈ మద్దెన గంగవరంపేట పెద్దదాయ. దాని సుట్టుకారం వుండే భూములకు యిలువ పెరిగె. ఎందుకూ పనికి రాని భూములు కూడా యిండ్లు కట్టుకునే దానికి మాత్రం పనికొచ్చె. ఆ ఊరికి వచ్చిండే బెంగుళూరు హై రోడ్డు పున్నెమాని... అందురూ భూముల్ని ఇండ్ల స్థలాలకు, కాలనీ యిండ్లకు అమ్ముకోని లచ్చలు సంపాయించ బట్రి. సేద్దెం జేసే రైతులు సేతలకు మట్టి అంటుకోకుండా, మడత నలగని తెల్ల గుడ్డలేసుకోని పటాటోపంగా బతకబట్రి. దాన్ని జూసి నీ కొడుకులకూ మొణుసు చెదిరె. దుడ్డు పైన ఎనలేని యావ పెరిగె ''మన భూమిని గూడ, సైటేసి ఎప్పుడెప్పుడమ్ముకుందామా, ఆ దుడ్డు ఎత్తక పోయి టవున్లో సైట్ల యాపారం జేసుకోని ఎప్పుడెప్పుడు కోటీస్పుల్లై పోదామా''అనుకుంటా వుండ్రి.

నువ్వు మాత్రం అదర్లా, పొదర్లా. ఏమీ ఎరగనట్లే వుంటివి.

లొగ దినం మన నడిసేన్లో వుండే యాప మాను కింద కూసోని ఎద్దులకు ముగుతాడు పేడుకుంటా వుంటివి. అప్పుడు నీ యిద్దురు కొడుకులు నీ దెగ్గిరి కొచ్చిరి.


''యిద్దురూ కలుసుకోని వొగతూరే వస్తిరే ఏమిరో'' అంటా అడిగితివి నువ్వు .

''ఏం లేదు నాయనా మంచి రేటొస్తాది. మనమూ మన సేన్లు అమ్మేద్దాం''తలొంచుకోని జెప్పె నీ పెద్దకొడుకు.

''యిప్పుడేం తక్కువైందని భూమమ్ముకోవాలా. మీకు ఉద్యోగాలుండాయి. మాకూ ఏదో గడిసి పోతా వుండాది. తిండికెవురూ గిరాం సెడి పోలేదే'' అంటివి నువ్వు

''ఎంత కాలమని మీరు మాత్రం ఈ పల్లెలో వుంటారు సెప్పు. మాకూ బిడ్డలుండారు. వోళ్లకు సదువులేమి? మంచీ సెడ్డా ఏమీ? ఈ నేలలో మన మేమన్నా కోటీస్పుల్లైనామా?''అనె నీ సిన్న కొడుకు.

''ఈ దుడ్డు ఎత్తక పోయి అట్ల సిత్తూర్లోనో, తిరపతిలోనో, భూమీమ్మదే పెడదాము నాయనా. కొనుక్కునే రెండేండ్ల కంతా డబులైపోతాది. వొగొగ తూరి పదింతలు గూడా అయిపోతాది. టవున్లో భూమికుండేంత యిలవ బంగారానిక్కూడా



లేదు.''

''ఈడ భూములు వానలు బడితే పండె. లేకంటే ఎండె. వానలు యాడ సక్కరమంగా పడతావుం డాయి? ఎప్పుడూ కరువే గదా!''

''యిప్పుడు నీ కాలం సేద్దెం గాదు నాయనా. మనం పండించే పంటలు... కూలీలకు సరిపోవ డంలా.''

వొగరు మార్చి వొగరుగా చెప్పిరి. నిన్ను శ్వానా వత్తిరి. అయినా నువ్వేమీ జగ్గలా.

అంతా యిని, వొగ్గెడివు యోచ్చన జేసి మల్ల జెప్తివి.

''వొరే. మిమ్మల్ని పెంచి పెద్ద జేసి సదివించి ఉద్యోగస్తుల్ని జేసినా. పెండ్లిండ్లు జేసినా. దాంతో తృప్తి పడండి. నేల జోలికి రాకండి. నేలంటే నాకు ప్రాణం. నేనే గాదు. మీతాత ముత్తాతలు దీని మిందే ఆధారపడి బతికినారు. బాగా బతికినారు. నా గొంతులో పాణముండంగా దీన్ని ధారపోసు కోను. మా కడంతరం అది మీదే. అప్పుడేమన్నా జేసుకోండి. మీయిష్టం. యింకెప్పుడు నేల మాటె త్తొద్దు''అంటివి.

''అది గాదు నాయనా... యిప్పుడు దీంట్లో ఏం వరుంబడుండని''అనె నీ పెద్ద కొడుకు.

''దీంట్లో వరుంబడి ఎంత వస్తావుండాదని గాదు. యిప్పుడొచ్చేది మాకు సరిపోతా వుండాది లే.''అంటివి నువ్వు

''వయసు మీరి పోయిండాది గదా మీకు. ఈ వయసులో ఏం కష్టపడతారు. ఎంతకాలం కష్టపడ తారు.''అంటా నిష్ఠూరపాయ నీ చిన్న కొడుకు.

''మేం బతికినంత కాలం కష్టపడతాం. మా మెతుకులు మేం సంపాదించుకుంటాంలే.''అంటివి.

''వొరేబ్బా. మా కాలూ సెయ్యీ ఆడేదాకా మాకేం దిగుల్లేదు లేరా''అంటి నేనూ.

దాంతో నీ బిడ్డలకు రోసాలు పొడసకొచ్చె.

''అదంతా ఎందుగ్గానీ, భూమి అమ్మి తీరా ల్సిందే''అంద్రి వోళ్లు

'' అది అయ్యే పని గాదు''అంటివి నువ్వు.

మీయబ్బా బిడ్డలు పట్టుదలకు పోతిరి పంతా లకు పోతిరి. శరత్తులు పట్టుకుంద్రి.

''అయితే మా భాగాలు మాకు పంచిచ్చెయ్. మా బతుకు మేం బతుక్కుంటాం''అంటా మొండికే సిరి నీ కొడుకులు.

''ఈ భూమిలో మీ తాతలు సంపాదించిం దెంత? వొగ గుడ్డం గోసి పాతంత. మిగిలిందంతా నా సొయార్జితం, సిన్న గుడ్డంతోనే బతికి ఎకరాలకు పెంపుజేసినా. మీరు సంపాదించిండుంటే ఎత్తక పోండి''భూమిని చూపిస్తా అంటివి.

''అయితే మీకు మీ కొడుకులు లేనట్టే''అంద్రి వోళ్లు.

''అనుకో పోండి. పరవాలేదు. సచ్చి దోరు గాల మైనా భూమ్మాత్రం పంచి ముక్కలు జెయ్యను'' అంటివి.

''మా మాటిననప్పుడు మీతో మాకేం పని. మీ సావు మీరు సావండి''అంద్రి బిడ్డలు.

నువ్వా రోసానికి పోతివి.

''అంతే గదరా యిక పోండి.''అంటా పైకి లేస్తివి నువ్వు.

''నువ్వుండే మిద్దెల్లు మా తాతల్ది గదా. అది పంచు''అంద్రి వోళ్లు దాంతో మిద్దిల్లు రెండు భాగాలు జేసి వోళ్లకే పంచిచ్చేస్తివి. నన్ను దీసుకోని మన సుట్టింట్లో కాపరం పెడితివి. ఎట్ట బతికినో డివి. ఈ ఊరికంతా మేటిగా బతికినోడివి. గ్రామా నికంతా పెద్ద మనిషిగా బతికినోడివి. వొగరికి తలొంచినోడివి గాదు. వంగి వంకాయలు కోసినో డివి గాదు. పులి మాదిరి తిరిగితివి. సిమ్మం మాది రుంటివి. అట్టాంటి నీకు...కడాకు గుడిసే గతాయ.

వోళ్లు మాత్రం ఆ యిల్లు గూడా అమ్ముకోని టవున్లో జేరి పోయిరి. యిది జరిగి మూడేండ్లు గాలా మరి!

యాడ బిడ్డలూ, యాడ పాపలూ..

ఏమయ్యా! ఎవురో వస్తావుండాదయ్యా... కండ్లుతెరువయ్యా. వొగసూరి నాకల్లా సూడయ్యా... ఏంజేసేదయ్యా. నిన్నీ పరిస్థితిలో సూస్తావుంటే నువ్వు బతికిన బతుకు, నీకే జెబ్దామ నిపిస్తా వుండాదయ్యా. ఇదంతా గెవ్ర నాని కొచ్చి కండ్లు దెరిసి మాట్లాడతావని... వొగ సిన్న మునాస.

ఏమయ్యా... అద్దో నీ కొడుకులు, కోడండ్లు...

రాలా రాలా అనుకుంటా వుంటివేమొ. వస్తా వుండారు. నీ మనవళ్లు, మనవరాండ్రు గూడా వస్తా వుండారు.

ఆ బాశాలి సూడు... నీ పెద్ద కోడాలు... పిల్లో ళ్లను కసురుకుంటా, మొగం చింగిలించుకుంటా వస్తా వుండాది. యింకొగ బాశాలుందేమిటికి నీ పెద్ద కొడుకు బిడ్డ సూడు. అంతా నా పోలికె. అ సిన్నోని పెద్ద కొడుకుండాడే వోణ్ణి జూస్తే నిన్ను జూసినట్టే.. వొళ్లను జూసైనా కండ్లు దెరుసు. మాట్లాడు. నేను బయటుంటాలే. వోళ్లు జూసి పోయినాక వస్తా... అయ్యో.అయ్యో ఆవరా! ఆవరా! నన్ను గూడా తోసుకోని వచ్చేసిరిపో...

''దామ్మా! నా సెక్కిరిపండు.. దారా..నా జేజినా యనా... ఎన్ని దినాలాయిందిరా. మిమ్మల్ని జూసి... రాండ్రా... రాండి తల్లీ...''నీ సిన్న మనవరాల్ని, సిన్న మనవన్ని వడిలోకి జేర్చుకున్నా... వీళ్లతో కాసింత సేపు బయటుంటాలే... అంత వరకూ మిగిల్నోళ్లు నిన్ను జూస్తారు.


ఏమయ్యా! కండ్లు దెరిసి నీ బిడ్డనన్నా వొగ సూరి సూస్తివా లేదా. పోయి రయ్యా. పిల్లా పాపల్తో వచ్చి, సుట్టపు సూపు మాదిరి సూసు పాయిరయ్యా వోళ్లు. అదీ వచ్చేవొళ్లు గాదులే. లోకా నికి ఎరుసుకోనొచ్చి సూసినారంతే. కన్నోళ్ల పైన చెమతుండి గాదులే. పోతా పోతా వాళ్లన్న మాట లింటివా?

''మేమడిగినప్పుడు భూమి అమ్మేసుకోనుంటే ఏ బాధా లేదు గదా. యిప్పుడు ఎవురు దిన్నె సొత్తు... మీరూ దిన్లే, మాకూ దక్కలా... తు:''అంటా మొగానూంచినట్టు అనేసి పోయిరి. పోయేటప్పుడు వోళ్లు అదే మాట... అందురూ అన్నె మాటే.. అనేసి పాయిరయ్యా.

''ఇంత పని ఎందుకు జేసుకుండె. ఎట్ల జేసుకుం డె''అని వోళ్లకేం తెలుసు నీ మొణుసు. వోళ్లు మాటి మాటికీ వచ్చి ''భూమమ్మోయి, భూమమ్మోయి'' అంటా గోకతా వుంటే గదా... నువ్వు పిడసల గంగ మ్మకు గుడి కడితివి.

''నేను బతుకుంటే ఎప్పటికైనా వీళ్ల భూమి పెరుక్కోని పోతారు... సేనుకంటే... సేన్లో గుడి

# మినహాయింపు



ప్రభుత్వం సినిమాల్లో పొగ త్రాగే దృశ్యాల్ని నిషేధించ టంతో 'మా కళాత్మక స్వేచ్ఛని కాల రాస్తున్నారంటూ' ఆ మధ్య సినీ జనమంతా చాలా గగ్గోలు పెట్టారు. ప్రభుత్వం మాత్రం ఒక మెట్టూ దిగి రాలేదు. ఇప్పుడు మాత్రం దయ తలిచి ఒక మినహా యింపునిచ్చింది. సినిమాల్లో చారిత్రక వ్యక్తుల పాత్రలేమైనా ఉంటే, వారికి నిజ జీవితంలో సిగరెట్ కాల్చే అలవాటుంటే, అప్పుడు ఆ పాత్ర పోషించే నటుడు కూడా నిశ్చింతగా సిగరెట్ కాల్చువచ్చుట. అంటే ఎప్పుడూ సిగార్ నోట్లో ఉంచుకునే దర్శనమిచ్చే విన్‌స్టన్ చర్చిల్ లాంటి చారిత్రాత్మక వ్యక్తులు, ఎప్పుడూ పైప్ పీలుస్తూండే షెర్లాక్ హోమ్స్ లాంటి కాల్పనిక వ్యక్తుల పాత్రలు పోషించే నటులు తెరపై పొగ త్రాగవచ్చన్నమాట. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ విషయంగా చట్టంలో మార్పు తేవాలని యోచిస్తోంది. ప్రభుత్వం ఈ నిర్ణయానికి రావడానికి ప్రముఖ దర్శక నిర్మాత మహేష్ భట్ కోర్టులో ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ వేసిన కేసు ముఖ్య కారణమట.



పదిలం'' అనుకునే కదా గుడి గడితివి. మడుషుల నమ్మేకంటే.. యిట్లా దేవతా రాళ్లను నమ్మేది మేలను కుంటివి. ఆ గంగమ్మే, సేను కాపాడుకుంటుందను కుంటివి. దాని కోసరమే గదా, సేన్లో... మన్ను దీసి.... పిడసలు జేసి, గంగమ్మ తల ముగ్గు మాదిరి సెక్కిండే గజం బండ పైన వాట్ని పెట్టి, ఊరంతా మెరవణి జేస్తివి. ఆ రేత్తిరే, మన్ను దీసిన గుంతలో సింత తుండ్లు కాల్సి, అగ్గిని గుండం జేస్తివి. ఆ గుండం తొక్కేదయిం తర్వాత ఆడనే గజం బండను నిలవునా నిలబెట్టి, దాని సుట్టకారం ... నాలుగు రాతి కూసాలు నిలిపి, మంటపం కడితివి... ఇంక అబ్బుట్నుంచీ సమచ్చరం సమచ్చరం ఆడనే తిర ణాల జరిపిస్తా వస్తివి.

ఇది తెలుసుకోని నీ బిడ్డలు నిప్పుల్లో పడిన ఉప్పు కల్లు మాదిర్తో ఆడెగిరి ఈడ బడిరి. నానా ఆగింతమూ జేసిరి.

'' మా యమ్మా మా నాయన మొగాలింక శాస్సి తంగా సూడమండ్రి.'' ''వాళ్లు సచ్చినోళ్లతో సమానం'' అంటా పోయి మనకు బతికుండంగానే దినాలు కూడా పెట్టేసిరి. కలిగ్గెమయ్యా కలిగ్గెం. దుడ్డుకుండే యిలవ మడిసికేడిది? యిన్నేండ్లకొచ్చి సూసి పోయినారు. యిన్నేండ్లూ ఏమిరా పాపుడా అంటా పలకరించిన పాపాన పోలా. ఏమి మీ కష్ట మని అడగలా. మన కొచ్చిందేమి చిన్న కష్టమా? ఇట్లా కష్టం మన తరమోళ్లు గానీ, మన తాతగారి తరమోళ్లుగానీ ఎవురన్నా విన్నారా? కన్నారా?

మన నెత్తిన పిశాచి మాదిరి వచ్చి పడింది. బిడ్డలు గాదన్నా గౌనేరు మాదిరిగా కాలి మింద కాలేసుకోని బతకతావున్నే నీకు ఈ పరిస్థితి తెచ్చి పెట్టిందెవురు? నీ బిడ్డలూ గాదు. నీ బందుగులూ గాదు. మనం ఓట్లేసి గెలిపించిన గవురుమెంటు.

ఈ గవురుమెంటు యాడున్నె భూముల్నీ కోటీ స్పులకమ్మేయ బట్టె. సర్కారు భూములైె పాయ... కడాకు రైతుల భూముల పైన బడె. ఆర్నెళ్లప్పుడు సర్కారోళ్లు గొలుసులు టేపులు పట్టుకోని నాలుగు గుంపులుగా జేరి కొందూరు, పి. కురప్పల్లె, కీలకం పల్లె గొర్రెల దొడ్డి, నాయని సెరువు, గుండూరు, పసుపత్తూరు భూములంతా కొలుసుకుంటా, సర్వే జేసుకుంటా వచ్చిరి... కడాకు మన గంగ్రాజు పల్లె భూముల్ని కొలుసుకోని పోయిరి.

''ఏంది ఈ అన్నాలం?''అంటా మండలాఫీ సుకు పరిగెత్తిరి. గంగవరం మండలాపీసు నిండా రైతులే...

తీరా తేలిందేమంటే... మన భూముల్లో టెక్స టైలు పార్కు పెడతారంట.

ఆ మాట యినంగానే రైతుల గుండెల్లో రాళ్లు బడె.

''ఇది అన్నాయం''అంటా అరిసిరి.

ఆ గుంపులో నువ్వూ వుంటివి. నీ పక్కనే నేనూ వుంటి...జనం వొగ దినమంతా అర్సి కొట్టుకున్నె తర్వాత... ఆఫీసర్లొచ్చి మన భూములకు నష్ట పరారం కట్టిస్తామండ్రి,, జనం ఇంక జేసేది లేక గొమ్మునుండి పోయి ఎవురిండ్ల కోళ్లు పోయిరి.

తీరా ఆ నష్ట పరారం దామాసా అంతా ఎంత? గొర్రె తోకంత . మనకు వేలల్లో, నూర్లల్లో యిచ్చి పార్కులు గట్టె కోటీస్పులకు కోట్లకమ్ముతారంట. కట్నోడు యింకెంత కోట్లకు పడగెత్తతాడో కాకుల్ని గొట్టి గద్దల కెయ్యడమంటే యిదే గదా.

''మీరిచ్చే నష్ట పరారం వొగ సమచ్చరానికి వచ్చే ధాన్నెం కొనకు గూడా సాల్దు. మేం వప్పుకోం'' అండ్రి జనం. సర్కారుతో సెలగాటం అంటే పొట్టేలి బొయ్యి కొండను ఢీకున్నిట్టే గదా.

''భూములుండే వోళ్లంతా... భూములు సోదీనం జెయ్యండంటా''నోటీసులిచ్చిరి.

రైతుల కడుపుల్లో శ్యాటడు నిప్పులు పోసిన ట్టయి పాయ.

''ఈ సర్కారు... ఉన్నోళ్ల భూముల్ను అడగచ్చు గదా''

ఆ వున్నోళ్లలో అందురూ రాజకీయాల్లో వుండే వోళ్లే వుంటార్లే... వోళ్లు వోళ్లు అంతా వొగిటే ..''

''ఓట్లేసి గెలిపించినందుకు, మన గొంతులే పట్టుకుంటా వుండారు. మన కొంపలే ముంచుతా వుండారు''

అనుకుంటా అందురూ తొర్రల్లో గూబలాల... గుబులు పడిపోయిరి.

ఇట్టాంటి పరిస్థితిలో ''నా బిడ్డలక్కూడా యియ్యకుండా సేన్లో గుడి కట్టించి కాపాడకొచ్చిన భూమిని ఎవుడి కోసరమో... సర్కారోళ్లు బలవం తంగా పెరక్కోను జూస్తా వుండారే. యిప్పుడేం జేయాల? ఎక్కడ బోవాల. ఈ ఆపితి నించీ యెట్ల తప్పించుకోవాల?''అంటా నీకు వొగిటే మనో యాది పట్టుకుండె.

''ఎవురు దిన్నె పాపం.... మా నోట్లో మట్టి కొడితివే...'' అంటా బిడ్డల నిష్ఠూరాలొగ పక్క.

''మీయిండ్లూ, భూములూ సోదీనం జేయండి'' అంటా వొగదానిమిదొగటిగా సర్కారోళ్ల నోటీసులిం కొగ పక్క.

అడకత్తిర్లో వొక్క నేసి నొక్కినట్లు నొక్కేసిరి నిన్ను, నీకేం జేయాలో తెలీలా....

తెలిసినోళ్ల దెగ్గిరి కంతా పోతివి. ఎందరి కాళ్లో పట్టుకుంటివి. అయినా నాభం లాకపాయ.

ఎమ్మార్వోను కలిస్తివి.

''అయ్యా, యిది సర్కారుతో యవ్వారం,, అది ఎట్ల సెప్తే అట్ల మేమినాల. అంతే, మా చేతుల్లో ఏమీ లేదు''అనె ఆయప్ప, అన్నించీ సిత్తూరుకు బోతివి. వొగ దినమంతా ఆడ... పడిగాపులు పడి, కలకటేరును కలుసుకోని అర్జీ రాసిస్తివి.

''ఓ గడ్డా సుబ్బయ్యా! గుడ్డిగా గవురుమెంటు నెదిరించొద్దు. ఎదిరించి, యింకా కష్టాలు దెచ్చుకో వద్దు. నష్టం కింద యేదో యిస్తారు. యింకొగ తావన యిండ్లు గట్టిస్తారు. వేరే ఆలోచన లేకుండా యెళ్లిపో''అంటా ఆ కలెట్రు యిత బోద జేసె.

కడాకు ఆ ఎమ్మెల్యేను గలిస్తివి.

ఆ ఎమ్మెల్యే''ఈ టెక్సటైలు పార్కు బడితే మీకే గదా మేలు. సదువుకున్నె పిలకాయలకందరికీ ఉజ్యోగాలొస్తాయి. జనమంతా బాగుపడతారు. భూములిచ్చే దానికి మీకేం బింగరం''అనె.

''ఈ భూములుండే వొళ్లంతా సదూ సందే లేని కష్టజీవులు. యిళ్లకేం ఉజ్యోగాలొస్తాయి. ఎందరి కని వస్తాయి. అంటివి నువ్వు.

''య్యావ్. పెద్దాయనా! యితండ వాదం



జెయ్యొద్దు గానీ పో''అంటా పంపించేశ నిన్ను. ఈన్నించీ అన్ని ఆశలు పోయి, సస్తినో బతికితినో అంటా యింటి కొచ్చి ''నా యత్నం అంతా ఉద్దాగా పాయ. ఇంకా ఈ మడుషుల్ని నమ్ముకుంటే నోట్లో దుమ్మే. ఆ గంగమ్మనే నమ్ముకుందాం'' అనుకుంటివి.

అన్నం గూడా దినలా... వచ్చినోడివి వచ్చినట్టే సేనుకాడికి పరిగెత్తితివి.

''వాసే పిడసల గంగమ్మా. రూపూ గీపూ లేని నీకు రూపం కల్పిస్తి. నా భూమిలోనే నాలుగు రాతి కూసాలు నిలేసి, గుడి కట్టించి నీకు తావు కల్పిస్తి. నా నేలంతా నీది. ఈ గుడీ నీదే. యింక ఈ భూమి నాది గాదు. నీ భూమిని నువ్వే కాపాడుకో'' అంటా దండాలు పెడతా కూసుంటివి. నన్ను మర్సి పోతివి. ఈ ఊరిని మర్సిపోతివి. ఈ ప్రపంచికీన్నే మర్సిపోతివి. నీకు భూమే ప్రపంచకమైపాయ. గుడే ఇల్లయిపాయ.

తడవు తడవుకు గుడి సుట్టకారం తిరగతావు. సేతులెత్తి మొక్కతావు. ''తల్లీ ఈ భూమినీ, రైతుల్నీ నువ్వే కాపాడుకో''అంటావు గుడికి ఎదురుగా వుండే యాప మాను సుట్టుకారం తిరగతావు. అదే మాదిరంటావు. పడి పడీ దండాలు పెడతావు. నేను అన్నం తెస్తే వొగ పిడస తింటావు. నీళ్లిస్తే గుక్కడు గుటక్కన మింగతావు. లేకంటే లే.

జుట్టు లేసి పాయ. గెడ్డం పెరిగి పాయ, యేసు కోనుండే గుడ్డలూ సినిగి పాయ, నీది వొగిటే గోస్టయి పాయ.

వొగ్గెడివు సేపు గంగమ్మను యేడుకుంటావు. మరు గెడివులో గబ్బు గబ్బుగా తిడతావు.

ఇది సూసి జనాలు ''గడ్డా సుబ్బయ్యకు పిచ్చి బట్టింది. ఎర్లు మర్లు బట్టి పోయినాడు రోయ్'' అంటా మాట్లాడుకో బట్రి. అయినా నీకిదేమీ బుర్ర కెక్కలా.

నీది వొగిటే మాట.

''నా భూమిని కాపాడుకునే దెట్లా?''

నీకు వొగిటే పని.

యాప మానెక్కేది. దిగేది. గంగమ్మకు మొక్కేది. తిట్టేది ఇట్లాంటి సమింలో... నాలుగు దినాలకు ముందేం జరిగె? సర్కారోళ్లు పోలీసు బందో బస్తితో వచ్చిరి... కార్లల్లో, జీపీల్లో దిగిరి. భూముల్ని ఆక్ర మించుకోని రాళ్లు నాటతా వచ్చిరి.

రైతులు నోళ్లు లేని మూగ జీవాలు మాదిరి మాటా పలుకూ లేకండా గొమ్మునుండి పోయిరి.

కడాన మన నేలను కొల్సి రాళ్లేసిరి.

నువ్వు అడ్డం పడితివి.

''నా భూమిలోకి రావద్దండి సాములూ''అం టివి. సేతులు పట్టుకుంటివి, కాళ్లు పట్టుకుంటివి. వోళ్ల మొణుసు కరగలే.

భూమ్మీద పడుకుంటివి. పోలీసోళ్లు నిన్నెత్త కొచ్చి బయటేసిరి. అయినా నువ్వు ఊరికే వుండలా.

లబలబ మంటా నోరు కొట్టుకుంటా, ''నాశ నమై పోతార్రా. మీ యింటి మొదుల్లేకండా అయి పోతార్రా''అంటా యింకా ఏమేమో సాపిస్తా దుమ్మెత్తి పోసి గుడి కాడికొస్తివి. వాళ్లు గుడికాడి కొచ్చి దాన్ని కూలగొట్టను ఆరంభించిరి. నువ్వు గుడిలోకి దూరి పోయి మద్దెలో పడుకోని '' నన్ను సంపేసి కూల గొట్టండ్రా ముండ నా కొడుకుల్లా లా''అంటివి.

''ఏ కాలం నించో వస్తావుండే మా భూముల్ని అన్యాయంగా ఆక్రమించుకుంటారా? రచ్చించా ల్సిన మీరే భచ్చించాలనుకుంటారా? మీ దూమ దగలా. మిమ్మల్నెత్తక పోయి నాయన సెరువు కట్టను గుంత తీసి పూడ్చా. మిమ్మల్ని యీ పిడసల గంగమ్మకు బలియ్యానీ. మీ నొసటన నల్ల నాగు బాము పటక్కన పెరకా''అంటా నోటికొచ్చినట్టు తిట్టబడితివి.

''వొరే. నన్ను యీడనే సంపేయండ్రా. అదే మాదిరి ఈ భూములుండే రైతుల్ని సంపేయండ్రా. సంపేసి అందర్నీ ఈ భూముల్లోనే సమాధులు జేయండ్రా. ఆ సమాధుల పైన మీ పునాదులు లేపు కోండ్రా. యిదే మాదిరిగా... ఈ దేశంలో వుండే బీదా బిక్కీ జనాల గొంతులు కోసి సంపేసి సమా ధులు కట్టండ్రా... జనాలు లేని... స్మశానాలను రామ రామ అంట నూరేండ్లు మీరే రాజ్జం జేసు కోండ్రా. నా కొడుకుల్లాలా''

అంటా శివం తొక్కితివి.

ఆఫీసర్లకు రోసం పొడసకొచ్చి, పోలీసుల చేత లాఠీల్తో పొడిపిచ్చిరి... ఎంకిలు యిరగ్గొట్టిచ్చిరి.

అందర్లో నీకు బగిశీనం అయిపాయ. అగు మానం అయిపాయ. ఆ బాధ భరించలేక... ఎప్పుడు దెచ్చి పెట్టు కోనుంటివో గుడిలో పక్కనే కిరసనాయిలు డబ్బా.... దాన్నెత్తి, నెత్తిన దిమ్మరిం చుకోని అగ్గివుల్ల గీసేసుకుంటివి.

అంతేనయ్యా... అంతే...

వొళ్లంతా ఎట్ల అయి పూడిసిందో సూడు! సూసే దానికే బీతు పుట్టేటిగా కాలిపోయిండాది. ఈ గవు రుమెంటాసుపత్రిలో నాలుగు దినాలుగా నేనూ నిన్ను కాపెట్టుకోని నీ పక్కనే వుండా.

ఆ డాక్టరు సద్దేళకాడొకసూరి సందేళకాడ వొగసూరి అట్లా వస్తాడు... చూస్తాడు... ఆ నర్సమ్మకేదో సెప్తాడు. ఆయమ్మ నీ వళ్లంతా తుడిసి, మందులేసి సేతికొగ సూది గుచ్చి, మందెక్కించి పోతా వుండాది. సూడయ్యా వొగసూరి నా కళ్లా సూడయ్యా. అయ్యో... నీ వళ్లు కదల్లే... మెదల్లే...

అద్దోనయ్యా.. నిన్ను జూడను జనాలంతా గుంపులు గుంపులుగా వస్తా వుండారు... అన్నేకారి పోలీసోళ్లు వోళ్లను లోపలికి రానీడంలా..

వోళ్లు అరస్తా వుండారయ్యా...

ఉప్పళంగా అరస్తా వుండారయ్యా...

ఏమయ్యా! నీకు యినిపిస్తా వుండాదా... లేవయ్యా.. లే...

వోళ్ల అరుపులు జూస్తా వుంటే నాకూ ఉద్రేక మొస్తా వుండాది. లేవయ్యా.. లే...లెయ్యవయ్యా, లెయ్యి!

*



## కర్నాటక సంగీతం నేర్చుకుంటున్న ఐశ్వర్య

ఐశ్వర్యా రాయ్ ప్రస్తుతం కర్నాటక సంగీతం నేర్చుకోవడంలో తలమునకలై ఉంది. మణిరత్నం లేటెస్టు చిత్రంలో ఆమె కర్నాటక సంగీత సాధకురాలిగా నటిస్తోంది. పెర్ఫెక్షనిస్టుగా పేరు పడిన మణి రత్నం చిత్రం కాబట్టి ఆమె తన పాత్రకు చాలా సీరియస్‌గా సన్నద్ధం అవుతోంది. ప్రత్యేకంగా కర్నా టక సంగీత నిపుణుణ్ణి టీచరుగా నియమించుకుని నేర్చుకుంటోంది. మణిరత్నం తీస్తున్న ఈ చిత్రం పేరు ఇంకా ఖరారు కాలేదు. 'రావణ' లేదా 'అశోక వనం' ఈ రెండు పేర్లలో ఏదో ఒకటి ఖాయం కావచ్చు. నిన్న మొన్నటి దాకా కేరళ అడవుల్లో దీని షూటింగ్ జరిగింది. కానీ కేరళ ప్రభుత్వం ఇక్కడ జరిపిన షూటింగ్‌తో తమ రక్షిత అటవీ ప్రాంతం కొంత దెబ్బతిందని, ఇక్కడితో షూటింగ్ నిలిపేయా లనీ ఆదేశించింది. షూటింగ్ నిలిచిపోవడం ఒక రకంగా ఐశ్వర్యారాయ్‌కు లాభించింది. ప్రస్తుతం పేగు సంబంధమైన వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో ఉన్న తన మావగారు అమితాబ్ బచ్చన్‌కు సపరిచర్యలు చేయడానికి ముంబయి వెళ్ళిపోయింది.